క్లుప్తంగా

యువత క్రీడల్లో రాణించాలి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న షబ్నం

మద్రిపాలెం: యువత క్రీడల్లో రాణించాలని మహిళా అండర్–19 వరల్డ్ కప్ విన్నర్, క్రికెటర్ షబ్నం అన్నారు. 53వ వార్డు మదీనా ముస్లిం మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ 2023 టోర్నమెంట్ విజేతల బహుమతుల ప్రదాన కార్యక్రమం ఆదివారం మద్రిపాలెం మసీద్ వీధిలో నిర్వహించారు. ముఖ్య అతిథి షబ్నం చేతుల మీదుగా టోర్నీ విన్నర్స్ దేవాడ టీం, రన్నర్స్ యాసీఎబాబా టీంలకు ట్రోఫీతోపాటు నగదు బహుమతిని అందజేశారు. యువత క్రీడల్లో రాణించి లక్ష్యాలను అధిగమిస్తే సమాజంలో గుర్తింపుతోపాటు తగిన గౌరవం. ప్రాధాన్యం లభిస్తాయన్నారు. అనంతరం ప్రపంచకప్ సాధించిన షబ్నం షకీల్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

చర్మకారుల సంఘ వనభోజనాలు



సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్, రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: ఉత్తరాంధ్ర చర్మకారుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆరిలోవ ముడసర్లోవ పార్క్‌లో వనభోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ హాజరై చర్మకారుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెల్లి కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, సంఘ ప్రెసిడెంట్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఐదుగురు పేకాటరాయుళ్లు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి తెలిపిన వివరాలిలా.. ఆదివారం సాయంత్రం 47వ వార్డు బాపూజీనగర్‌లో రైడ్స్ నిర్వహిస్తుండగా.. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను కంచరపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి నిందితులకు రిమాండ్

మద్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని పట్టుకున్న ఘటన శనివారం అర్ధరాత్రి దాటాకా జరిగిన విషయం తెలిసిందే. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఒడిశా కోరాపుట్ ప్రాంతానికి చెందిన కిలో కృష్ణ, కోరా అనిల్ అనే ఇద్దరు వ్యక్తులు రామ్మూర్తిపంతులుపేటలో శనివారం ఆటోలో గంజాయి తరలించడానికి సిద్ధంగా ఉన్న సమయంలో కంచరపాలెం పోలీసులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి 34 కేజీల గంజాయి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

ఆంజనేయ ఆలయంలో మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహారాణిపేట: మెయిన్‌రోడ్డు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని మన్యుసూక్త హోమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల పౌర్ణమి తిథి నాడు దేవాలయంలో మన్య సూక్త హోమం నిర్వహిస్తున్నారు. నరఘోష, శత్రు ఘోష, రుణబాధ నివారణ, గ్రహ శాంతి, కార్యసిద్ధి కోసం ఈ హోమం నిర్వహించినట్లు దేవాలయ ఈవో అల్లు జగన్నాథం తెలిపారు.

ఆధ్యాత్మికం

మాధవ'ధార'లో పుణ్యస్నానాలు

- మాఘ పౌర్ణమి వేళ.. విశేష పూజలు



మాధవధార మాధవ స్వామి ఆలయ ధార వద్ద స్నానాల కోసం క్యూకట్టిన భక్తులు

మద్రిపాలెం: మాఘ పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆదివారం మాధవధారలోని మాధవ స్వామి ఆలయం పులకించింది. పెద్ద ఎత్తున భక్తులు అక్కడి ధారలో పుణ్యస్నానాలు ఆచరించారు. వేకువజాము నుంచి వందలాది భక్తులు జలధార వద్దకు చేరుకుని స్నానాలు చేశారు. అనంతరం ఎంతో విశిష్టత కలిగి ఉన్న లీలామాధవ స్వామి ఆలయంలో వైభవంగా మాఘ పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఈ పుణ్య స్నానాలతో జలధార ప్రాంతమంతా కోలాహలంగా మారింది. మాఘ మాసం మూడో ఆదివారం మాఘ పౌర్ణమి కావడంతో మాధవుడి ఆలయానికి ఒడిశా, విజయనగరం, ఉమ్మడి విశాఖ జిల్లాల ప్రజలు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు, దేవస్థానం సిబ్బంది పర్యవేక్షించారు.

బౌద్ధాలయంలో పౌర్ణమి పూజలు



మహిళలకు చీరలు అందిస్తున్న బౌద్ధ సమాజం సభ్యులు

కంచరపాలెం: స్థానిక అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆదివారం మాఘ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో బుద్ధుడికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర బౌద్ధ సమాజ వ్యవస్థాపకుడు మల్లారపు అర్జున్‌రావుకు నివాళులర్పించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్.బాబూరావు, రాజు, భీమారావు, సూరిబాబు, రాము, రామచంద్రరావు, పరిమళ, సునీల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మురళీనగర్ తూర్పు ప్రాంత ప్రజలతో సమస్యలపై చర్చిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మురళీనగర్: కాలనీల్లో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు హామీ ఇచ్చారు. కార్పొరేటర్ మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆదివారం ఆయన మురళీనగర్ ఈస్ట్ ప్రశాంతి పార్కు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలను కలుసుకుని వారి సమస్యలను విన్నారు. పారిశుధ్య పరిస్థితులు, కాలువలు, భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో అల్లు శంకరరావు మాట్లాడుతూ నవరత్నాలు ప్రతి కుటుంబానికి అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. నిరంతర నీటి సరఫరా పథకంలో తవ్విన గోతులు పూడ్చిన మట్టి దిబ్బలు తొలగించకపోవడం వల్ల రాకపోకల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. యూజీడీ సమస్యను తక్షణం పరిష్కరించాలని ఏఈతో ఆయన మాట్లాడారు. కాలువలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పారిశుధ్యాన్ని చక్కదిద్దాలని సిబ్బందికి సూచించారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సహకారంతో వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ ఐ.రవి కుమార్, వార్డు సీనియర్ నాయకులు ఢిల్లీ రావు, జి.వెంకటరావు, రెహ్మాన్, సీహెచ్ శ్రీను, సీహెచ్ గోవింద్, బి.శివరామప్రసాద్, బి.శంకర్, మున్నా, కె.కిషోర్, ఆర్.శ్రీను, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: టీపీటీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో ఆదివారం 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన నేషనల్ మెరిట్–కమ్ మీన్స్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) టెస్ట్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ పరీక్షకు వివిధ పాఠశాలల నుంచి 240 మంది విద్యార్థులకు గానూ 229 మంది హాజరయ్యారు. డీఈవో చంద్రకళ పర్యవేక్షించారు. మాధవధార స్కూల్ హెచ్ఎం హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయంలో ఆధ్యాత్మిక చిత్ర ప్రదర్శన



పెయింటింగ్ ప్రదర్శనను ప్రారంభిస్తున్న సామవేదం షణ్ముకశర్మ

సీతంపేట: కళలకు ఆధ్యాత్మిక చింతన జోడిస్తే అది ఎంత గొప్పగానో నిలుస్తుందని ప్రముఖ ప్రవచన కర్త సామవేదం షణ్ముకశర్మ అన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక చిత్రకారిణి శ్రీలలిత టేకుమళ్ల వేసిన ఆధ్యాత్మిక ×లలిత లలితం౯ పేరిట పెయింటింగ్ చిత్ర ప్రదర్శనను ఆదివారం మధ్యాహ్నం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళలకు ఆధ్యాత్మికత జోడించడం గొప్ప విషయమని, లలితా టేకుమళ్ల పెయింటింగ్ ప్రదర్శన అద్భుతమని కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు వి.రమేష్, ఆచార్య టి.సుధాకర్‌రెడ్డి, ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి కె.నిరుపమ రాణి, రామవరపు మాధురిదేవి, శంకర్ నీలు పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌లో సెల్‌ఫోన్ దొంగల హల్‌చల్



రైతుబజార్ ఈవో కొండబాబు అదుపులో ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సెల్‌ఫోన్ దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం రైతుబజారు రద్దీగా ఉండటంతో అదే అదును చూసుకుని వినియోగదారులు కూరగాయలు కొనుగోలు చేస్తుంటే.. సెల్‌ఫోన్లు దొంగతనం చేశారు. దీంతో రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ క్రైం పోలీసులకు సమాచారమివ్వడంతో వారు రంగంలోకి దిగారు. ఇద్దరు యువకులను సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మహిళలకు రక్షణ కవచం 'దిశ'



స్టాల్‌ను సందర్శనలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

కొమ్మాది: రాష్ట్రంలో 18 దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసి అందులో ఒక డీఎస్పీ స్థాయి ఆఫీసర్‌ను నియమించి మహిళలకు రక్షణ కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పేర్కొన్నారు. రుషికొండ రాడిసన్ బ్లూలో జరుగుతున్న షీ ఈజ్ ఏ చేంజ్ మేకర్ అనే మహిళా ప్రజా ప్రతినిధుల సదస్సులో ఏర్పాటు చేసిన దిశ స్టాల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కల్యాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన దిశ చట్టం, దిశ యాప్ మహిళలకు ఒక రక్షణ కవచంలా ఉందన్నారు. మహిళల ఫోన్‌లో దిశ యాప్ ఉంటే వారికి ఒక అన్న తోడుగా ఉన్నట్లే సీఎం భరోసా కల్పించారని చెప్పారు. ఈ సదస్సుకు హాజరైన పది రాష్ట్రాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులు దిశ యాప్ ప్రాముఖ్యత తెలుసుకున్నారు. ఈ యాప్ ఆడపిల్లలకు ఒక వరమని మహిళా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు

కంచరపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్–2 డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ, సంస్థ జోన్–2 ఈఈ బి.కోటేశ్వరనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కంచరపాలెం రామ్మూర్తి పంతులుపేట జోన్–2 ఏపీఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చుతగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లుల్లో పేరు మార్పు, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు తదితర సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు 70 మంది ఎంపిక



జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన వారితో జానకీరామ్

మహారాణిపేట: న్యూఢిల్లీలోని తల కట్టోర ఇండోర్ స్టేడియంలో ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు 70 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. న్యూ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం ఎంపిక పోటీలు నిర్వహించారు. జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి 70 మంది ఎంపిక కాగా.. ఇందులో 50 మంది విశాఖ క్రీడాకారులే కావడం విశేషం. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏపీ మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ పాల్గొని.. ఎంపికైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ రాజధానిలో పతకాలు సాధించి.. రాష్ట్ర ప్రతిష్ఠను మరింతగా ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఎంపిక పోటీలకు జి.నూకరాజు, డి.ప్రేమ్‌కుమార్, ఎస్.సతీష్ కుమార్, ఎస్.నరేష్, శంకర్, ఎర్రయ్య, శ్రీనివాస్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కోచ్ జి.గోవింద్, టీమ్ మేనేజర్ చంద్రశేఖర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.నూకరాజు ఎంపికైన వారిని అభినందించారు.

27, 28 తేదీల్లో రేణుక యల్లమ్మ జాతర

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి 23వ జాతర మహోత్సవాలు ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు అధ్యక్షతన కార్యవర్గ సభ్యులు సమావేశం నిర్వహించారు. కమిటీ ముఖ్య సలహాదారుగా వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్‌ను నియమించారు. జాయింట్ సెక్రటరీగా బడే నాగరాజును నియమిస్తూ తీర్మానించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఏర్పాట్లు, ఉత్సవాల నిర్వహణపై కమిటీ సభ్యులు చర్చించారు. ఆలయ కమిటీ సభ్యులు బొడ్డు పోలరావు, వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్ పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అప్రమత్తం



వాకర్స్‌కు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హేమంత్‌కుమార్ బెహరా

అల్లిపురం: గుండె జబ్బుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలతో గుండె పదిలంగా ఉంచుకోవచ్చని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ హేమంత్ కుమార్ బెహరా అన్నారు. మెడికవర్ హాస్పటల్స్ సౌజన్యంతో ఆదివారం సరస్వతి పార్కులో హెల్త్ టాక్, హెల్త్ క్యాంపు పేరిట అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె ఆరోగ్యానికి చేయాల్సిన పనులు, గుండెపై ఒత్తిడి ఎలా వస్తుంది, ఒత్తిడి తగ్గించుకోవడం, వ్యాయామం వల్ల గుండెకు కలిగే రక్షణ, తీసుకోవాల్సిన ఆహారాలు తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో పార్క్ అధ్యక్షుడు వాడ్రాపు సింహాచలం మూర్తి, రామారావు, శివ, లింగం శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

46వ వార్డులో డిప్యూటీ మేయర్ పర్యటన



లక్ష్మీనగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు సూరిబాబునగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఆదివారం డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పర్యటించారు. ఇక్కడ ఇటీవల చేపట్టిన సీసీ రోడ్లు, గెడ్డలు, కల్వర్టులు, డ్రైనేజీల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. వార్డును సుందరంగా తీర్చేదిద్దే లక్ష్యంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కటుమూరి సతీష్ తెలిపారు. వార్డు పర్యటనలో తాగునీటి సమస్య, వీధి లైట్ల నిర్వహణపై స్థానికులు ఫిర్యాదులు చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారమయ్యేటట్లు చర్యలు తీసుకుంటానని డిప్యూటీ మేయర్ తెలిపారు. పర్యటనలో జి.అప్పారావు, ఎస్.కృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేష్, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేరాల జోలికి పోవద్దు



ద్వారకా పీఎస్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: ద్వారకా జోన్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్లలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐలు సింహాద్రినాయుడు, శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించి వేలి ముద్రాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ రౌడీ షీటర్ల దినచర్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని, కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని రౌడీ షీటర్లకు సీఐలు సూచించారు.

'స్వరాజ్య స్ఫూర్తి @ 75' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్ తదితరులు

సీతంపేట: స్వాతంత్ర్యోద్యమ చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీనియర్ పాత్రికేయుడు కె.శ్రీనివాస్ అన్నారు. రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సభలో వెలుగు పక్షాన రామినాయుడు సంకలన పర్చిన 'స్వరాజ్య స్ఫూర్తి @ 75' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. తొలి ప్రతిని గరిమెళ్ల మనవడు అశోక లక్ష్మణకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ చరిత్రను మర్చిపోతున్నామని, ఇటువంటి తరుణంలో ఈ పుస్తకం ఎంతో అవసరమన్నారు. రచయిత డి.వి.సూర్యారావు పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, పౌర గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, సీతామహాలక్ష్మి, రమాకాంత్, రామాంజనేయులు పాల్గొన్నారు.

యూపీ సుశాషన్ యాత్ర కో–ఆర్డినేటర్‌గా వంశీయాదవ్



యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను కలిసిన ఉప్పిలి వంశీ యాదవ్

మద్రిపాలెం: ఉత్తర ప్రదేశ్‌లో సుశాషన్ యాత్ర కో–ఆర్డినేటర్‌గా 50వ వార్డు మురళీనగర్‌కు చెందిన బీజేపీ జాతీయ యువమోర్చా కార్యవర్గ సభ్యుడు ఉప్పిలి వంశీ యాదవ్ నియమితుడయ్యారు. యూపీలోని లక్నోలో యువమోర్చా సుశాషన్ యాత్ర మొదలు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేపట్టే కార్యక్రమాలను దేశవ్యాప్తంగా ప్రజలకు తెలియజేయడానికి, బీజేవైఎం జాతీయ అధ్యక్షులు తేజస్వి సూర్య ఆధ్వర్యంలో ఆదివారం ఈ యాత్ర ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఉప్పిలి వంశీ యదవ్ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా యూపీ సీఎం యోగితో జరిగిన సమావేశంలో తాను పాల్గొని యాత్రపై సలహాలు, సూచనలు చేశానని వంశీ తెలిపారు. సుశాషన్ యాత్ర దేశంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా బల్లల పండగ



బల్లల పండగ పూజలో పాల్గొన్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి దంపతులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు వెంకటరాజు నగర్‌లో శ్రీదుర్గా గణేష్ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, వైఎస్సార్‌సీపీ నేత ఆళ్ల శ్రీనివాస్ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని రజకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్థానికులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, సంఘ అధ్యక్షుడు ఎస్.మాధవ, సెక్రటరీ ఎస్.గణేష్, సీనియర్ నాయకులు వెంకటేష్, శ్రీనివాసరెడ్డి, సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్స్ హెచ్ఎంల ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయికలో ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు

కంచరపాలెం: ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జె.సోమశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం కంబాలకొండలో ప్రైవేటు స్కూళ్ల హెచ్ఎంలు, కరస్పాండెంట్లు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రైవేటు స్కూళ్ల ఐక్యతను బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ ఏడాదిలో అత్యధిక పాఠశాలలు సభ్యత్వ నమోదుకు ముందుకు రావాలని సోమశేఖర్ కోరారు. మధ్యాహ్నం విందు, వినోదాలతో నూతన ఏడాది సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ప్రైవేటు స్కూళ్ల సభ్యులు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన బ్రహ్మోత్సవాలు



కాళీ కాలభైరవులకు హారతి ఇస్తున్న పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితాపీఠంలో రెండు వారాలుగా జరుగుతున్న 74వ బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు లలితాపీఠంలో విశేష పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా పండితుల వేదమంత్రాల నడుమ విశేష పూర్ణాహుతి, కుంభాభిషేకం, శాంతి కల్యాణం నిర్వహించారు. కుర్తాళం, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షణలో పీఠంలో కాళీ కాలభైరవుల ప్రతిష్ఠ చేశారు. అనంతరం స్వామి వారు హారతి ఇచ్చారు. వ్యవస్థాపక పీఠాధిపతి దక్షిణామూర్తి పరమహంస, ద్వితీయ పీఠాధిపతి అవ్యక్తానంద మహారాజ్, తృతీయ పీఠాధిపతి శివచిదానంద భారతీ స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని, పీఠం ఆస్థాన వేద పండితులు మాచవోలు రమేష్ శర్మ, సీతఈవో మోచర్ల శశిభూషణ్, లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ , పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.